


# 9 దీపావళి

**నేపథ్యం:**
భారతదేశంలో జరుపుకునే వివిధ పండుగలను గురించి తరగతిలో చర్చించండి. జాతీయ సమైక్యత విశిష్టతను తెలుసుకోండి. ఈ పాఠంలో దీపావళి పండుగను గురించి తెలుసుకొందాం.

మన భారతదేశము పుణ్యభూమి. ఆయా సందర్భాలనుబట్టి మనం ఎన్నో పండుగలను జరుపుకొంటాం. అట్టి పండుగలలో దీపావళి ఒకటి. తెలుగువారు దీనిని దివ్వెల పండుగ అని పిలుస్తారు.

దీపావళి అనగా దీపముల వరుస యని అర్థం. ఈ పండుగను ప్రతి ఏటా ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు జరుపుకొంటారు.

ఈ పండుగను గూర్చి మిక్కిలి ప్రచారంలోనున్న కథ నరకాసుర వధ. పూర్వం నరకుడను రాక్షసరాజు ఉండేవాడు. అతడు మిక్కిలిక్రూరుడు. దేవతలను, ఋషులను ప్రజలను బాధించేవాడు.



**దుబ్బు దుబ్బు దీపావళి! మళ్ళీ వచ్చె నాగుల చవితి.**

ఉ.సూ : విద్యార్థులచే మౌనపఠనం, ప్రకాశ పఠనం చేయించండి.

వారంతా శ్రీకృష్ణుని వద్దకు వచ్చి రక్షించమని వేడుకొన్నారు. వెంటనే శ్రీకృష్ణుడు తన భార్య సత్యభామతోసహా వెళ్ళి నరకాసురుని వధించాడు. అపుడు ప్రజలు ఆనందంతో ఉత్సవం జరుపుకొన్నారు. అదే నరక చతుర్దశిగా పిలువ బడుచున్నది. ఈనాడు పిల్లలు, పెద్దలు తెల్లవారు జాముననే లేచి తలస్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు.

మరునాడు దీపావళి. ఈ రోజున లక్ష్మీపూజ చేస్తారు. ఈరోజు బంధువులతోను, మిత్రులతోను కలిసి సంతోషంగా గడుపుతారు ఒకరికొకరు పిండి వంటలను ఇచ్చిపుచ్చుకొంటారు. సాయంత్రం ఇండ్లను రంగవల్లులతో, దీపములతో అలంకరిస్తారు. రంగురంగుల గుమ్మటాలు కడతారు. పిల్లలు, పెద్దలు బాణసంచా కాలుస్తారు. చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు, భూచక్రములు, విష్ణు చక్రములు, వెన్న ముద్దలు మొదలగు టపాకాయలు కాలుస్తారు.

మరుసటి దినము బలిప్రతిపద. ఈ రోజు పశువులను అలంకరించి, వానికి పూజ చేసి, పశువుల కాపరులను సత్కరించుట మహారాష్ట్రుల సంప్రదాయం.

ఆ తరువాతి రోజు 'యమద్వితీయ'. దీనిని మహారాష్ట్రులు 'భాఊ బీజ్' అంటారు. ఆనాడు అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళ ఇంటికి వెళ్ళి వారితో కలిసి భోజనము చేస్తారు. కొన్ని ప్రాంతముల వారికి ఆ దినము నుండి నూతన సంవత్సరము ప్రారంభమగును.

దీపావళి పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ. పర్యావరణానికి హాని కలిగించని విధంగా ఈ పండుగను జరుపుకోవాలి.

## I. వినండి–చెప్పండి.

1. భారతీయులు జరుపుకొనే కొన్ని ముఖ్య పండుగలను చెప్పండి.
2. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు జరుపుకునే పండుగ ఏది ?
3. తెలుగు నెలల పేర్లు చెప్పండి.

## II. సంభాషించండి.

1. పండుగలను ఎందుకు జరుపుకుంటారు ?
2. మీ ఇంట్లో జరిపే ఒక పండుగను గూర్చి తెలియజేయండి.
3. భారతీయుల సంస్కృతి పండుగల్లో ఎలా కనిపిస్తుందో తెలియజేయండి.

## III. కొత్త పదాలు నేర్చుకుందాం

వధ = చంపుట; క్రూరుడు = దయలేనివాడు; వేడుకొనుట = ప్రార్థించుట; ఉత్సవము = పండుగ; నూతన = క్రొత్త; కీడు = చెడు; సంప్రదాయం = అనాదిగా ఆచరిస్తున్న పద్ధతులు

## IV. చదవండి–చెప్పండి–రాయండి.

### అ. సరియైన సమాధానం గుర్తించి రాయండి.

1. దీపావళిని ఇలా కూడా పిలుస్తారు.
   (అ) దీపముల వరుస
   (ఆ) దివ్వెల పండుగ
   (ఇ) లక్ష్మీపూజ
   (ఈ) యమద్వితీయ
2. శ్రీకృష్ణుని భార్య
   (అ) సత్యభామ (ఆ) జానకి
   (ఇ) లక్ష్మి (ఈ) పార్వతి
3. బలిప్రతిపద నాడు పూజించేది.
   (అ) దేవతలను (ఆ) పక్షులను
   (ఇ) ప్రకృతిని (ఈ) పశువులను

### ఆ. ఒక్కొక్క వాక్యంలో జవాబులు రాయండి.

1. దీపావళి పండుగను ఎప్పుడు జరుపుకొంటారు ?
2. నరక చతుర్దశి రోజు ప్రజలు ఏమి చేస్తారు?
3. బలిప్రతిపద నాడు మహారాష్ట్రుల సంప్రదాయమేమి ?
4. యమద్వితీయ నాడు ఏమి చేస్తారు ?

### ఇ. మూడు, నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.

1. నరక చతుర్దశిని గురించి రాయండి.
2. ప్రజలు దీపావళి పండుగనెట్లు జరుపుకొందురు ?

### ఈ. ఖాళీలు పూరించండి.

1. మనం ఎన్నో ________ జరుపుకుంటాము.
2. సాయంత్రం ఇండ్లను రంగవల్లులతో ________ అలంకరిస్తారు.
3. పర్యావరణానికి ________ కలిగించని విధంగా ఈ పండుగను జరుపుకోవాలి.

## V. భాషావగాహన :

### అ. సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

1. వేడుకొను
2. అలంకరించు
3. హాని
4. ఆనందోత్సాహాలు

### ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. అతడు <u>మిక్కిలి</u> క్రూరుడు.
2. ప్రజలు <u>ఆనందంతో</u> ఉత్సవం <u>జరుపుకొన్నారు</u>.
3. పిల్లలు, <u>పెద్దలు</u> కొత్త బట్టలు <u>ధరిస్తారు</u>.

### ఇ. కాలాలు గుర్తించండి.

1. పూర్వం నరకుడను రాక్షసరాజు ఉండేవాడు.
2. సాయంత్రం లక్ష్మీపూజ చేయబోవుచున్నారు.

### ఈ. వాక్యాంగాలను గుర్తించండి.

1. నరకాసురుడు ప్రజలను బాధించేవాడు.
2. పిల్లలు బాణసంచా కాలుస్తారు.
3. శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించెను.

### ఉ. వాచకాలు రాయండి.

1. శ్రీకృష్ణుడు
2. అక్క
3. పశువులు
4. సత్యభామ

### ఊ. ఉక్త లేఖనం :-

1. సందర్భాలు
2. ప్రచారం
3. ఉత్సవం
4. వెన్నముద్దలు



## VI. సమాచారపేటిక తెరుద్దాం.

- అంతర్జాలం (ఇంటర్ నెట్) నుండి క్రిస్మస్, ఈద్, వినాయక చవితి పండుగలను గురించి తెలిసికొని 5, 6 వాక్యాలు రాయండి.

### ఇంకొంచెం తెలుసుకుందాం!

**యమద్వితీయ :-**

యమునానది యమ భగవానుని చెల్లెలు. వీరి గురించి ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. యమున తన అన్నను అనేక సార్లు తన ఇంటికి ఆహ్వానించింది. ఒకనాడు అతడు ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమె కుటుంబం యముని ఎంతో గౌరవించి, పూజించారు. యమున స్వయంగా భోజనం తయారుచేసి ఆతిథ్యం ఇచ్చింది. ఆతిథ్యాన్ని స్వీకరించిన యముడు ఆమెకు వరమిచ్చాడు. అందువలన ఆరోజు యమద్వితీయగా ప్రసిద్ధికెక్కింది. సోదరి, సోదరుని పూజించిన రోజు కావున దీనిని **"భ్రాతృద్వితీయ"**గా కూడా పిలుస్తారు.

### నేనివి నేర్చుకున్నా.

- ఏ పని చేసినా పర్యావరణానికి హాని కల్గించని విధంగా చేయాలి.
- పండుగలను అందరూ కలిసి మెలిసి చేసుకోవాలి.
- అన్ని సంస్కృతులను గౌరవించాలి.

ఉ.సూ : భాషా నియమాలను తెలిసికొని నిత్యవ్యవహారంలో తప్పులు లేకుండా చక్కగా మాట్లాడేందుకు ప్రోత్సహించండి.